# రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ బి.తిమ్మారెడ్డిగారికి జోహార్లు



**రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర ఉపాధ్యక్షులు, సి.పి.ఐ.(యం.ఎల్) అనంతపురం జిల్లా నాయకుడు కా॥బి.తిమ్మారెడ్డి 2018 జూన్ 6వ తేదీ ఉదయం 4 గంటలకు గుండెపోటుతో అనంతపురం ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. జూన్ 3వ తేదీన రెండు మోకాళ్ళ కీళ్ళ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకొన్నారు. రెండు సం॥ల క్రితం బైపాస్ సర్జరీ జరిగివున్న తిమ్మారెడ్డిగారికి, ఈ ఆపరేషన్ అనంతరం వచ్చిన గుండెపోటు ఆయనను మనకు దూరంచేసింది. మోకాళ్ళ ఆపరేషన్ చేయించుకొని ఇంకా 10 ఏళ్ళు చురుకైన పాత్ర వహించాలని ఆయన ఆపరేషన్‌కు సిద్ధపడ్డారు.**

6వ తేదీ ఉదయానికి కా॥తిమ్మారెడ్డిగారి భౌతికకాయాన్ని స్వగ్రామమైన రాయదుర్గం తరలించారు. సిపిఐ(ఎం.ఎల్) అనంతపురం జిల్లా కార్యదర్శి కా॥సి.పెద్దన్న ఆయన భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. అనంతపురం నుంచి పార్టీ కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు ఆయన భౌతికకాయంతోపాటు రాయదుర్గం తరలివెళ్ళారు. అక్కడ రైతుకూలీలు, ఉపాధ్యాయులు, దళితులు, ప్రజాతంత్రవాదులు, కుటుంబసభ్యులు, బంధువులు వందలాదిమంది వచ్చి నివాళులు అర్పించి ఆయన అంతిమయాత్ర, అంత్యక్రియలను నిర్వహించారు.

**పీడిత ప్రజానాయకుడు కా॥తిమ్మారెడ్డి**

కామ్రేడ్ తిమ్మారెడ్డి 1942లో రాయదుర్గం ప్రాంతం గొడిశలపల్లిలో రైతుకుటుంబంలో పుట్టారు. చదువు పూర్తిచేసి, ఉపాధ్యాయవృత్తిని చేపట్టారు. ఉపాధ్యాయుడుగా జీవితాన్ని ప్రారంభించి ఉపాధ్యాయ హక్కులకోసం పోరాడుతున్న ఏ.పి.టి.ఎఫ్‌లో క్రియాశీల కార్యకర్తగా, సంఘ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. ఉపాధ్యాయ సమస్యలేకాక సమాజంలోని అణగారిన ప్రజల సమస్యలపట్ల స్పందిస్తూ వచ్చారు. 1977లో మార్క్సిస్టు సాహిత్యాన్ని అధ్యయనంచేస్తూ అమరుడు కా॥మండ్ల సుబ్బారెడ్డిగారితో పరిచయాలు ఏర్పరచుకొని అమరుడు కా॥తరిమెల నాగిరెడ్డి పార్టీ రాజకీయ విధానాలను స్వీకరించారు. తన చుట్టూ అట్టడుగు ప్రజలనుంచి ఉన్నత విద్యావంతుల వరకూ ప్రజలందరి హక్కులపై జరుగుతున్న దాడులను, అణచివేతలను గమనించి హక్కుల ఉద్యమ చైతన్యం కల్గించడం అవసరమని తలచి ఓపిడిఆర్‌లో చేరి హక్కుల ఉద్యమ నాయకుడుగా నిలిచాడు. అనంతపురం జిల్లాలో శోత్రియం భూములకోసం, ఈనాం భూములకోసం పోరాడుతున్న రైతుకూలీల పోరాటాలకు అండగా నిలిచారు. 1996లో బొమ్మనహాళ్‌లో భూస్వాముల ఆక్రమణలోని ప్రభుత్వ భూములను భూమిలేని నిరుపేదలు తమ స్వాధీనానికై పోరాడితే, పెత్తందార్లు కిరాతకంగా 26 మందిని కాళ్ళు, చేతులు నరికి భయానక వాతావరణం సృష్టించారు. ఈ ఘటన జరిగిన వెంటనే కా॥తిమ్మారెడ్డి కదలి, దాడికి గురైనవారికి ధైర్యం చెప్పి నిలబెట్టి, వైద్యసహాయం అందేలా చూశారు. రాయదుర్గం ఏరియాలో ఇళ్ళులేని పేదల కొరకు అనేక ఆందోళనలు సాగించి భగత్‌సింగ్‌నగర్ నిర్మింపచేశారు. దుర్భర జీవితాలను గడుపుతున్న చేనేత కార్మికులను సమీకరించి కార్మిక నాయకులైన కా॥పెద్దన్నతో కలసి పోరాటాలను నిర్వహించి వేతనాల పెంపుకి కృషిచేశారు.

బడిపిల్లలకు మంచి ఉపాధ్యాయునిగానే కాకుండా పీడిత ప్రజలందరికీ పోరాట నాయకుడుగా నిలిచాడు. అందుకే ప్రభుత్వం ఆ కామ్రేడ్‌ను అరెస్టుచేసి నిర్బంధించడంతో సస్పెండ్ అయినా వెనుకంజవేయలేదు. సస్పెన్షన్ తొలిగాక, గొల్లపల్లిలో టీచర్‌గా వున్న సమయంలో మరోసారి పోలీసులు అరెస్టుచేసే ప్రయత్నంచేస్తే, గ్రామ మహిళలు రక్షణగా నిలబడి అడ్డుగా దాచుతూ గ్రామం దాటించి కాపాడారు. “మా సారునే అరెస్టుచేస్తారా” అని ప్రశ్నించారు. ఇటీవల 2016లో అనంతపురం కరువు సమస్యపై రైతుకూలీసంఘంగా వేసిన అధ్యయన కమిటీ సభ్యులుగా రాయదుర్గం ప్రాంత గ్రామాలన్నీ కమిటీతో కలిసి తిరిగారు. గత 10 సం॥లుగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర ఉపాధ్యక్షునిగా కా॥తిమ్మారెడ్డి చురుకైన పాత్ర వహించారు. కా॥తిమ్మారెడ్డి ఆకస్మిక మృతిపట్ల రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గం తీవ్ర విచారం వ్యక్తంచేస్తూ, వారి కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపాన్ని, సానుభూతిని తెలియపరుస్తోంది. కా॥తిమ్మారెడ్డికి విప్లవ జోహార్లర్పిస్తోంది.

**సంస్మరణ సభ**

18-6-2018న కామ్రేడ్ తిమ్మారెడ్డిగారి సంస్మరణసభ రాయదుర్గం సింధనూరు ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. సభ ప్రారంభానికి ముందు వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు ఊరేగింపుగా నినాదాలు ఇస్తూ, జోహార్లు చెపుతూ సభకి చేరుకొన్నారు. కా॥తిమ్మారెడ్డిగారిపై రాసిన పాటలను కళాకారులు ఆలపించారు. సంస్మరణ సభకు కామ్రేడ్ సి.పెద్దన్న అధ్యక్షత వహించారు. ఈ సభలో వక్తలు ఆయన కృషిని, జీవితాన్ని, త్యాగనిరతిని గుర్తుచేసుకొని నివాళులు అర్పించారు.

సంస్మరణ సభలో మొదట రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥యస్.ఝాన్సీ మాట్లాడుతూ రైతుకూలీసంఘంలో చురుకైన పాత్ర నిర్వహిస్తున్న కా॥తిమ్మారెడ్డి మరణం–అనంతపురం రైతుకూలీ ఉద్యమానికేకాక రాష్ట్ర నిర్మాణానికి తీరనిలోటని చెప్పారు. ఉపాధ్యాయునిగా వృత్తిచేపట్టినా, క్రమంలో పీడిత ప్రజలందరి పక్షాన నిలబడి నాయకునిగా ఎదిగారని చెప్పారు. ఉపాధ్యాయునిగా రిటైర్ అయినా, ఉద్యమంలో మరింత చురుకైన పాత్ర వహించి ఉద్యమకృషికి రిటైర్‌మెంట్ లేదని తేల్చి చెప్పాడని చెప్పారు. దళితులు, బలహీనవర్గాల ప్రజల గుండెల్లో నిలిచిపోయాడని చెప్పారు. ఆయన జీవితంలోని ముఖ్య ఘట్టాలను గుర్తుచేస్తూ, ఆయన ఇంతటి ఘనమైన ప్రజాజీవితంలో వుండటానికి కారణం ఆయన ఎంచుకొన్న తరిమెల నాగిరెడ్డి రాజకీయ విధానం, మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతమేనని చెపుతూ నివాళులు అర్పించారు.

ఉపాధ్యాయ ఉద్యమ సీనియర్ నాయకులు, ఏపిటిఎఫ్ మాజీ రాష్ట్రకార్యదర్శి కా॥పరమేశ్వరరావుగారు మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో ఏపిటిఎఫ్‌ను బలోపేతం చేయడంలో తిమ్మారెడ్డిగారిది ప్రముఖ పాత్ర అని, ఉపాధ్యాయ అధ్యయన తరగతులను అనేకసార్లు నిర్వహించి ఉపాధ్యాయులలో సామాజిక, రాజకీయ అవగాహన పెంచడంలో ఆయన కృషి ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. అనంతరం ఓపిడిఆర్ రాష్ట్ర కార్యదర్శి వి.హనుమంతరావు మాట్లాడుతూ ఓపిడిఆర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా సుదీర్ఘకాలం కొనసాగిన కా॥తిమ్మారెడ్డి మరణం హక్కుల ఉద్యమానికి తీవ్ర నష్టం అని, ప్రజల హక్కులకోసం నిర్విరామంగా కృషిచేసి 'ఓపిడిఆర్ తిమ్మారెడ్డి'గా పేరుపొందారని తెలిపారు. బళ్ళారి న్యాయవాది, హక్కుల ఉద్యమాలు, భూముల పరిరక్షణకోసం ఉద్యమాలు సాగిస్తున్న చాగనూరు మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ తిమ్మారెడ్డిని 'రాయదుర్గం కొండ'గా అభివర్ణిస్తూ బళ్ళారిలో జరిగిన నిర్వాసిత పోరాటాలలో తిమ్మారెడ్డి పాత్ర, సహకారం వెలకట్టలేనిదని వివరించారు. తెలుగు, కన్నడ భాషలలో రెంటిలో పట్టున్న తిమ్మారెడ్డి ప్రజల హక్కులపై దాడిని తిప్పికొట్టి నిరంతర ప్రచార కార్యక్రమాలు చేపట్టేవారని పేర్కొంటూ నివాళులు అర్పించారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥డి.వర్మ మాట్లాడుతూ సంఘం రాష్ట్రకార్యవర్గ సమావేశాలలో కా॥తిమ్మారెడ్డిగారు రైతాంగ సమస్యలపై ఒక లోతైన అవగాహనతో వివరించేవారని, ఆయన మృతి రాయదుర్గానికే కాదు రైతుకూలీసంఘానికి తీరని లోటని చెపుతూ జోహార్లు తెలిపారు.

ఇంకా అనేకమంది బంధుమిత్రులు, ప్రజాతంత్రవాదులు, చేనేత కార్మికులు, ఉపాధ్యాయ ఉద్యమ నేతలు అమరుడు కా॥తిమ్మారెడ్డిగారికి ఘనమైన నివాళులర్పించారు. సభకు అధ్యక్షత వహించిన కా॥పెద్దన్న కా॥తిమ్మారెడ్డిగారితో నాలుగు దశాబ్దాల అనుబంధాన్ని ఉద్వేగభరితంగా వివరిస్తూ కుటుంబ సభ్యులకు సంతాపం తెలపడంతో సభ ముగిసింది.

ooooo